క్లుప్తంగా

అనంత ఆధ్యాత్మికం విష్ణు సహస్రనామం



విష్ణు సహస్రనామ పారాయణలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్‌: మహాభాగవతులు ఆళ్వారులు వాగ్గేయకారులు పారాయణ చేసిన విష్ణుసహస్రం శాంతి సంపద కలిగించే అనంత ఆధ్యాత్మిక స్తోత్రమని భోగి గణపతిపీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. శనివారం ఉదయం సుప్రభాత వేళ 38వ శ్రీవారి సంకీర్తనలో విష్ణు పారాయణ చేశారు. మహాభారత అనుశాసనిక పర్వం 149వ అధ్యాయంలో విష్ణు నామాలు, అనంత ఆధ్యాత్మికమన్నారు. గణపతి వేంకటేశ్వర విగ్రహ మూర్తులకు పంచామృతాభిషేకాలు చేశారు. శ్రీవారి భక్తులకు పసుపు, కుంకుమ, రవిక, గాజులు పంపిణీ చేశారు.

పీఏసీఎస్‌లకు ప్రత్యేక అధికారుల నియామకం



కరపలో బాధ్యతలు స్వీకరించిన అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ దుర్గాప్రసాద్‌

కరప: పీఏసీఎస్‌లకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కరప మండలంలో ఏడు పీఏసీఎస్‌లు ఉన్నాయి. కరప, కూరాడ, జెడ్‌.భావారం, పెద్దాపురప్పాడు పీఏసీఎస్‌లకు కాకినాడ అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ ఎన్‌వీఎస్‌ఎస్‌ఆర్‌కే దుర్గాప్రసాద్‌ ప్రత్యేకాధికారిగా నియమితులవగా, శనివారం ఆయన ఆయా సొసైటీలకు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన కరపలో మాట్లాడుతూ తనకు కేటాయించిన నాలుగు పీఏసీఎస్‌లు లాభాల్లోనే ఉన్నాయన్నారు. ఈ సంఘ పరిధిలో రైతులను సభ్యులుగా చేర్పించి, మరింతగా లాభాలు ఆర్జించేలా స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు, ఇతర సేవలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. సీఈఓలు పంపన వెంకటరమణ, బి.పరశురాముడు, రాయుడు వెంకటేశ్వరరావు, కోలా త్రిమూర్తులు పాల్గొన్నారు. అలాగే పెనుగుదురు, వేములవాడ, యండమూరు పీఏసీఎస్‌లకు సీనియర్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎస్‌.రవికుమార్‌, అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌లు కె.ప్రతాప్‌కుమార్‌, బి.కృష్ణవేణి ప్రత్యేకాధికారులు బాధ్యతలు తీసుకున్నారు.

సక్రమంగా 'ఎన్‌టీఆర్‌ భరోసా' పంపిణీ

సిటీ ఎమ్మెల్యే వనమాడి సూచన



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

కాకినాడ: ఎన్‌టీఆర్‌ భరోసా పింఛన్ల పంపిణీని జూలై ఒకటో తేదీనే ఎలాంటి లోటుపాట్లు లేకుండా సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలని ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) కోరారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శనివారం సాయంత్రం పింఛన్ల పంపిణీపై సచివాలయాల అడ్మిన్‌ సెక్రటరీలు, వెల్ఫేర్‌ సెక్రటరీలతో సమావేశమయ్యారు. నగరపాలక సంస్థ కమిషనర్‌ జె.వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ సోమవారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్‌ జె.వెంకటరావు మాట్లాడుతూ 30,552 మంది లబ్ధిదారులకు రూ.21.30 కోట్ల సొమ్ము పంపిణీ చేస్తున్నామన్నారు. ఆయా సచివాలయ కార్యదర్శులకు లక్ష్యాన్ని నిర్దేశించి ప్రతీ ఇంటికి వెళ్ళి లబ్ధిదారులకు పింఛన్లు ఇచ్చేలా ఆదేశాలు ఇచ్చామన్నారు.

వలంటీర్లు లేకుండా పింఛన్లు అందేనా!

- రేపు పంపిణీ
- సిద్ధమవుతున్న సచివాలయ ఉద్యోగులు

అవ్వా.. ఇదిగో పింఛన్‌. తాతా.. జగన్‌ బాబు పింఛన్‌ పంపారు తీసుకోండి.. అంటూ ఒకటో తేదీ తెల్లవారకముందే వలంటీర్లు ఇంటి తలుపుతట్టి మరీ పింఛన్లు అందజేసే ప్రక్రియకు ఫుల్‌స్టాప్‌ పడింది. వీరి స్థానంలో వైఎస్సార్‌ పింఛన్‌ కానుకకు ఎన్‌టీఆర్‌ భరోసాగా పేరు మార్చి సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీకి సోమవారం కొత్త ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. అవ్వా తాతలు ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విధానాన్ని పక్కన పెట్టిన కొత్త ప్రభుత్వం నిర్ణయం ఏ మేరకు విజయవంతం అవుతుందో వేచి చూడాలి.



వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రికి వెళ్లి పింఛన్‌ అందజేస్తున్న వలంటీర్‌ (ఫైల్‌)

కాకినాడ: జిల్లా కేంద్రం కాకినాడలో ఎన్‌టీఆర్‌ భరోసా పేరుతో పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. దాదాపు 30,552 మందికి పింఛన్లు ఇవ్వనున్నారు. గతంలో ఇచ్చే రూ.3 వేలు పింఛన్‌ను రూ.4 వేలకు పెంచడంతో పాటు, ఏప్రిల్‌, మే, జూలై నెలలకు పెంచిన రూ.వెయ్యి మొత్తాన్ని కలిపి మొత్తం రూ.7 వేలు చొప్పున పింఛన్‌దారులకు ఇవ్వనున్నారు. ఇందుకోసం కాకినాడ సిటీలో రూ.21.3 కోట్ల సొమ్మును పంపిణీకి సిద్ధం చేశారు.

సచివాలయ ఉద్యోగుల ద్వారా...

పింఛన్ల పంపిణీని సచివాలయ కార్యదర్శులతో అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటికే పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేశారు. ఉదయం 6 గంటల నుంచే కార్యదర్శులు నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు ఇవ్వనున్నారు.

కార్యదర్శులతో సాధ్యమేనా?

సచివాలయ కార్యదర్శుల ద్వారా ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్లను ఇంటి వద్దకే పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ఆచరణలో ఎంత వరకు సాధ్యమవుతుందనే ప్రశ్న తలెత్తుతోంది. వాస్తవానికి గతంలో కాకినాడ సిటీ పరిధిలో సుమారు 1800 మంది వలంటీర్లు సాయంత్రంలోపు గానే పింఛన్లను పంపిణీ చేశారు. అదే పనిని ఇప్పుడు సుమారు 700 మంది సచివాలయ కార్యదర్శులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఇది ఆచరణలో ఎంత వరకు విజయవంతం అవుతుందోనన్న ప్రశ్న తలెత్తుతోంది. అలాగే గత ప్రభుత్వంలో ఎక్కడైనా పింఛన్‌దారుడు అనారోగ్యకారణాలతో ఆస్పత్రిలో ఉంటే అక్కడికి కూడా వెళ్లి వలంటీర్లు పింఛన్‌లు అందజేసి మానవత్వాన్ని చాటుకునేవారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కొనసాగుతుందా? లేదా అన్న ప్రశ్న నెలకొంది. మరో వైపు మొదటి రెండు రోజుల్లోనే పింఛన్‌ ఇస్తారని, ఆ తరువాత ఇచ్చే అవకాశం కూడా ఉండదన్న ప్రచారం కూడా జరుగుతుంది.

గతంలో పడిగాపులు

పింఛన్లు పంపిణీ చేసే క్రమంలో 2014–19 మధ్య లబ్ధిదారులు పింఛన్‌ తీసుకునేందుకు తీవ్ర ఇక్కట్లకు గురయ్యేవారు. గంటల తరబడి పంపిణీ కేంద్రాల వద్ద క్యూకట్టేవారు. కొంతమంది వేచి ఉండలేక స్పృహ కోల్పోయిన సందర్భాలు ఉండేవి. ఈ పరిస్థితికి చెక్‌ పెట్టేందుకే గత జగన్‌ ప్రభుత్వం ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ విధానాన్ని కొనసాగించాలని భావిస్తున్నప్పటికీ ఆచరణలో ఎంత వరకు విజయవంతం అవుతుందోనన్న ప్రశ్న తలెత్తుతోంది.

ఆరు గంటల నుంచే పంపిణీ



ఎన్‌టీఆర్‌ భరోసా పింఛన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే సచివాలయ కార్యదర్శుల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పింఛన్లు అందజేస్తాం. ఆ మేరకు నగదు సిద్ధం చేశాం. సంబంధిత సిబ్బందికి అవసరమైన ఆదేశాలు ఇచ్చాం. పంపిణీ సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం.

– జె.వెంకటరావు,
కమిషనర్‌, కాకినాడ నగరపాలక సంస్థ

ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు

బోట్‌క్లబ్‌: పిచ్చి ముదిరితే తలకు రోకలి చుట్టమన్నారన్న రీతిగా కాకినాడలో ఇష్టారాజ్యంగా రాజకీయ ఫ్లెక్సీలు పెడుతున్నారని పౌర సంక్షేమసంఘం కన్వీనర్‌ దూసర్లపూడి రమణరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌ ఫస్ట్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ కార్యాలయం గేట్లకు పొలిటికల్‌ ఫ్లెక్సీలు అమర్చడం శోచనీయం అన్నారు. మెయిన్‌ రోడ్డు సినిమా రోడ్డు, దేవాలయం వీధి ప్రాంతాల్లోని మలుపుల్లో క్రాస్‌ రోడ్స్‌ జంక్షన్‌లో అటు నుంచి వచ్చే వాహనాలు కనపడకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. వీధి దీపాలకు, టెలిఫోన్‌ స్తంభాలకు, రోడ్‌ డివైడర్స్‌ వీధి స్తంభాలకు వెడల్పుకు మించి నిలువెత్తు ఫ్లెక్సీ ఫ్రేమ్‌లు నిలబెట్టడం ప్రమాదకరమన్నారు. శిథిల టూటౌన్‌ బ్రిడ్జి, ఎన్‌టీఆర్‌ బ్రిడ్జిల మీద స్తంభాలకు ఫ్లెక్సీలు కట్టడం అత్యంత ప్రమాదంగా ఉందన్నారు. నగర పర్యటనలు చేస్తున్న కార్పొరేషన్‌ ఉన్నతాధికారులు వీటి గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

కరప: మండల పరిధిలో లబ్ధిదారులకు జూలై నెల ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలకు సంబంధించి వివిధ రకాల పింఛన్ల లబ్ధిదారులు 11,572 మంది ఉన్నారన్నారు. వారికి రూ.7,75,97,500 ఇచ్చేలా ఇప్పటికే గ్రామ కార్యదర్శులకు అందజేసినట్టు తెలిపారు. గ్రామ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వీఆర్వోలు, ఇతర ప్రభుత్వోద్యోగులతో పింఛన్లు ఒకటో తేదీనే అందజేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. గురజనాపల్లిలో ఒకటో తేదీన ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు పర్యటించి పింఛన్లు పింపిణీ చేస్తారని ఎంపీడీఓ తెలిపారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



ఉపాధ్యాయులతో కలసి 'నేను బడికిపోతా' ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్‌ శ్రీనివాసరావు

కరప: పిల్లలను పనిలోకి కాకుండా బడిలోకి పంపించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని గురజనాపల్లి సర్పంచ్‌ అనసూరి శ్రీనివాసరావు తెలిపారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా శనివారం గురజనాపల్లిలోని పబ్బినీటి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు ఉపాధ్యాయులకు సహకరిస్తామన్నారు. తర్వాత ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, తల్లిదండ్రులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మన ఊరిబడి మన పాలిట గుడి.. నేను బడికిపోతా.. ఊరువాడా కదులుదాం మనబడిని బాగుచేసుకుందాం.. అంటూ నినాదాలు చేశారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను చైతన్యపరచారు. ఎంపీటీసీ సభ్యురాలు వై.వీరవేణి, హైస్కూలు హెచ్‌ఎం ఎ.సాయి మోహన్‌, స్టాఫ్‌సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఉపాధ్యాయులు వేణుగోపాల్‌, రమణి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఎంపీపీ పదవికి పద్మజ రాజీనామా



రాజీనామా లేఖను జెడ్పీ సీఈఓ శ్రీరామచంద్ర మూర్తికి అందజేస్తున్న గోపుశెట్టి పద్మజ

కాకినాడ రూరల్‌: కాకినాడ రూరల్‌ ఎంపీపీ గోపుశెట్టి పద్మజ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని జెడ్పీ సీఈఓ శ్రీరామచంద్రమూర్తికి జెడ్పీ కార్యాలయంలో శనివారం అందజేశారు. గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాకినాడ రూరల్‌ కొవ్వాడ గ్రామానికి చెందిన పద్మజ ఎంపీటీసీగా గెలిపొందారు. మండలంలో మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలకు 15 వైఎస్సార్‌ సీపీకి, మూడు జనసేనకు రావడంతో అప్పట్లో ఎంపీపీ పదవి ఓసీ మహిళా రిజర్వేషన్‌ కేటగిరిలో మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆశీస్సులతో మెజార్టీ సభ్యుల సహకారంతో ఆమె ఎంపీపీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆమె ఎంపీపీ పదవికి మాత్రమే రాజీనామా చేసి ఎంపీటీసీగా కొనసాగనున్నారు. మూడు నెలల్లో నోటిఫికేషన్‌ ద్వారా ఇక్కడ ఎంపీపీని ఎన్నుకోవాల్సి ఉంది. ఈ లోగా ఎంపీపీ బాధ్యతలను వైస్‌ ఎంపీపీ చేపట్టనున్నారు. కాకినాడ రూరల్‌లో ఇద్దరు వైస్‌ ఎంపీపీలు ఉండగా ఎంపీపీ పదవి మహిళకు రిజర్వ్‌ అవ్వడంతో వైస్‌ ఎంపీపీగా ఉన్న తిమ్మాపురం ఎంపీటీసీ బందిలి విరీషకు తాత్కలికంగా ఎంపీపీ చాన్స్‌ దక్కనుంది. తన రాజీనామాపై పద్మజ మీడియాతో మాట్లాడుతూ వ్యక్తిగత కారణంతోనే ఎంపీపీ పదవికి రాజీనామా చేసినట్టు తెలిపారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ రాజీనామా లేఖపై తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ రాజీనామాపై పంచాయతీరాజ్‌ కమిషనర్‌కు నివేదించనున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు రూ.7.2 లక్షల స్కాలర్‌షిప్‌లు



విద్యార్థినికి ప్రతిభా పురస్కారాన్ని, స్కాలర్‌షిప్‌ను అందజేస్తున్న అతిథులు

బాలాజీచెరువు: సత్య స్కాన్‌ – డయగ్నోస్టిక్‌ సెంటర్‌ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సత్య చారిటబుల్‌ ట్రస్ట్‌ సౌజన్యంతో 10వ తరగతిలో 60 మంది ర్యాంకర్లుకు రూ.7.2 లక్షల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేసినట్టు ట్రస్ట్‌ చైర్మన్‌ కాదా వెంకటరమణ తెలిపారు. స్థానిక జేఎన్‌టీయూ అలుమిని ఆడిటోరియంలో ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ర్యాంకర్లకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ట్రస్ట్‌ చైర్మన్‌ అధ్యక్షతన ఎన్‌టీఆర్‌ హెల్త్‌ వర్సిటీ వీసీ డాక్టర్‌ కె.బాబ్జీ ముఖ్య అతిథిగా కేఎస్‌పీఎల్‌ సీఈఓ మురళీధర్‌ విశిష్ట అతిథిగా, ఐఎంఏ స్టేట్‌ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ జీఎస్‌ మూర్తి, రోటరీ మాజీ గవర్నర్‌ డాక్టర్‌ ఎస్‌వీఎస్‌ రావు, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్‌ శృతిరెడ్డి, భాష్యం పబ్లిక్‌ స్కూల్‌ జోనల్‌ ఇన్చార్జి గోవిందరాజులు, సత్య స్కాన్‌ సెంటర్‌ డైరెక్టర్లు డాక్టర్‌ కె.విష్ణుమూర్తి, డాక్టర్‌ పి.లక్ష్మణమూర్తి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తాను పడిన కష్టం ప్రతిభ గల ఏ విద్యార్థీ పడకూడదని వెంకటరమణ చేస్తున్న కృషిని అభినందించారు. డాక్టర్‌ కాదా వెంకటరమణ మాట్లాడుతూ ఈ 60 మంది ర్యాంకర్లు ఇంటర్‌, ఎంసెట్‌లో సాధించిన ర్యాంకులను బట్టి ఉన్నత చదువులకు ప్రోత్సాహకాలు ఇస్తామని తెలిపారు.

విజ్ఞానదాయకంగా కెమెరాల ప్రదర్శన



పురాతన కెమెరా ప్రదర్శనను ప్రారంభిస్తున్న సీనియర్‌ ఫొటోగ్రాఫర్‌ జగన్నాథం

బోట్‌క్లబ్‌: జాతీయ కెమెరాల దినోత్సవం సందర్భంగా కాకినాడ కెమెరా క్లబ్‌, ప్రొఫెషనల్‌ ఫొటోగ్రాఫర్స్‌ అసోసియేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక టౌన్‌ హాల్‌ సమావేశ మందిరంలో పురాతన కెమెరాల ప్రదర్శన శనివారం నిర్వహించారు. సీనియర్‌ ఫొటోగ్రాఫర్‌ బళ్ల జగన్నాథం ఈ ప్రదర్శనను ప్రారంభించి ఇటువంటి ప్రదర్శన ద్వారా కెమెరాల ఆకారాలు, విశేషాలు నేటి తరానికి తెలుసుకోవడానికి ఎంతో వీలు ఉందన్నారు. నాటి కెమెరాలతో తీసిన ఫొటోలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. కాకినాడ కెమెరా క్లబ్‌ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో సుమారు 150 ఏళ్ల నాటి కెమెరాలు కూడా ఉన్నాయన్నారు. తమ క్లబ్‌ సభ్యులు రామచంద్రపురం స్టూడియో అధినేత వి.బాలకృష్ణ ఆధ్వర్యంలో సేకరించిన సుమారు 500 కెమెరాలను, వీడియో కెమెరాలు కూడా ఈ ప్రదర్శనలో చూడవచ్చని అన్నారు. కాకినాడ కెమెరా క్లబ్‌ ఏర్పడి సుమారు 53 ఏళ్లు అవుతోందని, ఏటా క్రమం తప్పకుండా జాతీయ కెమెరా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాకినాడ కెమెరా క్లబ్‌ను 1971లో అప్పటి జిల్లా కలెక్టర్‌ మాల కొండయ్య అధ్యక్షతన వైద్యులు, ఇంజినీర్లు, ప్రొఫెసర్లు, కెమెరామెన్‌ సంయుక్తంగా ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో కాకినాడ కెమెరా క్లబ్‌ అధ్యక్షులు ఎన్‌వీఎస్‌ఎస్‌ రామమూర్తి, ఉపాధ్యక్షులు డాక్టర్‌ శివరామకృష్ణ, సంయుక్త కార్యదర్శి జేవీఎస్‌వీ ప్రసాద్‌, కోశాధికారి నేరేడు సోమరాజు, ప్రొఫెషనల్‌ ఫొటోగ్రాఫర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు తోట సూర్య సుబ్బారావు, గౌరవ అధ్యక్షులు జశ్వంత్‌ శ్రీను పాల్గొన్నారు.





ప్రదర్శనలో ఉంచిన పురాతన కెమెరాలు

జూలై 3న ఇండియన్‌ క్రిస్టియన్‌ డే

నాగమల్లితోట జంక్షన్‌ (కాకినాడ సిటీ): క్రాంతి టీవీ, హౌస్‌ఆఫ్‌ ప్రేయర్‌ ఆధ్వర్యంలో జూలై 3న ఇండియన్‌ క్రిస్టియన్‌ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆల్‌ఇండియా క్రిస్టియన్‌ కౌన్సిల్‌ కాకినాడ శాఖ అధ్యక్షుడు రిక్కిగూటం శనివారం తెలిపారు. స్థానిక మెక్లారిన్‌ గ్రౌండ్స్‌లో 3వ తేదీ సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విజయవాడ క్రైస్ట్‌ టెంపుల్‌ సంఘ పాస్టర్‌ రెవ డాక్టర్‌ పాల్‌ ఇమ్మానుయేలు వచ్చి దైవ సందేశం అందిస్తారన్నారు.

నేడు హనుమాన్‌ శోభాయాత్ర

సామర్లకోట: రెండు మున్సిపాలిటీల పరిధిలో ఆదివారం సాయంత్రం హనుమాన్‌ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పి.ప్రభాకర్‌, జీవీకె మోహన్‌రావు, ఎ.శివయ్య, అల్లు ప్రసాద్‌, కర్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వేలాది మంది భక్తులతో సాగే మోటారు సైకిల్‌ శోభాయాత్ర ర్యాలీని స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభిస్తారని తెలిపారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌, ప్రత్తిపాడు జంక్షన్‌, బ్రౌన్‌పేట జంక్షన్‌, పాత తహసీల్దార్‌ కార్యాలయం, గాంధీచౌక్‌, స్టేషన్‌ సెంటర్‌, మఠంసెంటర్‌, మెహర్‌కాంప్లెక్స్‌ మీదుగా తిరిగి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సెంటర్‌కు శోభాయాత్ర చేరుతుందన్నారు. అక్కడి నుంచి పెద్దాపురం పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తామని చెప్పారు.

ముంపు నివారణకు చర్యలు తీసుకోండి



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్‌ వెంకటరావు

కాకినాడ: వర్షం వల్ల ఏర్పడే ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్‌ జె.వెంకటరావు పేర్కొన్నారు. శుక్రవారం కురిసిన వర్షంతో స్థానిక శిగలక్ష్మీనారాయణ నగర్‌ ప్రాంతంలోని మదర్‌ థెరిసా విగ్రహం నుంచి ఫౌండేషన్‌ ఆసుపత్రి మీదుగా చర్చి వరకు ముంపునకు గురైన ప్రాంతాన్ని కమిషనర్‌ శనివారం సందర్శించారు. ముంపు నివారణకు తీసుకోవలసిన చర్యలపై ఇంజినీరింగ్‌, ప్రజారోగ్య విభాగం అధికారులతో చర్చించారు. రహదారులను ఎత్తు చేసేందుకు అవసరమైన అంచనాల రూపొందించాలని, ఈ లోపుగా అవుట్‌లెట్లు శుభ్రం చేయాలని సూచించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓ డాక్టర్‌ పృథ్వీ చరణ్‌, ఏఈ వై.నాగేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్‌ రాంబాబు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

గాంధీ పార్క్‌ అభివృద్ధికి చర్యలు

కాకినాడ: ఎంతో చరిత్ర కలిగిన గాంధీనగర్‌ పార్క్‌ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని కమిషనర్‌ జె.వెంకటరావు హామీ ఇచ్చారు. శనివారం ఆయన ఎస్‌ఈ పి.సత్యకుమారి ఇతర అధికారులతో కలిసి పార్క్‌లో పర్యటించి అక్కడి వాకర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్కులో ఏర్పాటు చేసిన క్రీడా, జిమ్‌ పరికరాలను, టాయ్‌లెట్ల నిర్వహణను పర్యవేక్షించారు. పార్కు ఆవరణలో నిరుపయోగంగా, శిథిలావస్థకు చేరిన ఓ భవనాన్ని తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన షటిల్‌ కోర్టును మహిళలు మాత్రమే వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

జాతీయ లోక్‌ అదాలత్‌లో 445 కేసుల పరిష్కారం



కోర్టును పరిశీలిస్తున్న లోక్‌ అదాలత్‌ చైర్మన్‌ కమలాదేవి

కాకినాడ లీగల్‌: జాతీయ లోక్‌ అదాలత్‌ ద్వారా 445 కేసులు పరిష్కారమయ్యాయని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, లోక్‌ అదాలత్‌ చైర్మన్‌ పి.కమలాదేవి తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం 10 బెంచ్‌లు ఏర్పాటు చేసి జాతీయ లోక్‌ అదాలత్‌ నిర్వహించారు. ఈ లోక్‌ అదాలత్‌లో 445 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ బెంచ్‌లకు న్యాయమూర్తులుగా నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, ఆరోఅదనపు జిల్లా జడ్జి నిఖిత, రెండో అదనపు సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎస్‌.విజయబాబు, ప్రిన్సిపాల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి వి.లీలా శ్యామ్‌ సుందరి, రెండో అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి ఎం.ప్రసన్న లక్ష్మి, మూడో అదనపు జ్యుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మేజిస్ట్రేట్‌ డి.శ్రీదేవి, నాలుగో అదనపు జ్యుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మేజిస్ట్రేట్‌ నిరూప బాంజ్‌డియో, ఐదో అదనపు జ్యుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మేజిస్ట్రేట్‌ షేక్‌ షరీన్‌, స్పెషల్‌ మొబైల్‌ జ్యుడీషయల్‌ మేజిస్ట్రేట్‌ ఎన్‌.ఉషాలక్ష్మి కుమారి, స్పెషల్‌ ఎక్సైజ్‌ అండ్‌ ప్రొహిబిషన్‌ ఫస్ట్‌క్లాస్‌ మేజిస్ట్రేట్‌ ఎ.నాగమల్లేశ్వరి వ్యవహరించారు.

గాలివాన బీభత్సం

నేలకొరిగిన చెట్లు, విద్యుత్‌ స్తంభాలు

కరప: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున అల్పపీడన ప్రభావంతో గాలి, వాన భీభత్సం సృష్టించింది. తెల్లవారుజామున 4.30 గంటలకు విపరీతమైన గాలులు, ఆ తర్వాత ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురిసింది. గ్రామాల్లోని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు, జనజీవనం అతలాకుతలమైంది. కాకినాడ–రామచంద్రపురం ప్రధానరహదారిలో వాకాడ బస్టాప్‌ వద్ద చెట్లు విరిగిపడ్డాయి. కూరాడ, వాకాడ గ్రామాల్లో గాలివానకు చెట్లు కూలి విద్యుత్‌ తీగలపై పడటంతో రెండు విద్యుత్‌ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో మండలంలోని కరప, వలసపాకల, వేములవాడ, వాకాడ, కూరాడ, పెదకొత్తూరు, వేళంగి తదితర గ్రామాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలిగింది. భారీవర్షానికి గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణలు వర్షపు నీటితో నిండిపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు పడ్డారు. పల్లపు ప్రాంత భూముల్లోని నారుమళ్లు ముంపుకు గురయ్యాయని రైతులు తెలిపారు. కరప విద్యుత్‌ శాఖ ఏఈ సానా ఈశ్వరప్రసాద్‌ సిబ్బందితో కల్సి వాకాడ, కూరాడ గ్రామాల్లో పర్యటించి విద్యుత్‌ తీగలపై పడ్డ చెట్లను తొలగింపచేశారు. యుద్ధ ప్రాతిపదిక పనిచేసి విద్యుత్‌ స్తంభాలను నిలబెట్టి, విద్యుత్‌తీగలను సవరించి, విద్యుత్‌సరఫరాను పునరుద్దరించారు.



కూరాడలో విద్యుత్‌ లైన్‌పై విరిగిపడిన చెట్లు



వాకాడ బస్‌స్టాప్‌ వద్ద విరిగిపడిన చెట్లు



కరప మండల పరిషత్‌ కార్యాలయం ఆవరణలోకి చేరిన వర్షపు నీరు



వాకాడ గ్రామంలో విద్యుత్‌ స్తంభంపై విరిగిపడిన చెట్లు

నేడు చిత్రలేఖన పోటీలు

పెద్దాపురం: పెద్దాపురం చిల్డ్రన్‌ క్లబ్‌ (పీసీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 30 తేదీన పర్యావరణ చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్టు పీసీసీ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్‌ తెలిపారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శనివారం చిత్రలేఖన పోటీల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామని, 30వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థులు 90006 95301, 79016 97939 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.